క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్మల్ నియోజకవర్గంలోని 124 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

వడ్గాం వాసికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న రాహుల్

తానూరు: మండలకేంద్రంలోని వడ్గాం గ్రామానికి చెందిన మద్నూరే రాహుల్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈయన హిందీ విభాగాధిపతి ప్రొఫెసర్ వాగ్మారే మాయాదేవి పర్యవేక్షణలో 'హిందీ దళిత నవలల్లో మానవ హక్కులు'అనే అంశంపై విశ్లేషణాత్మక అధ్యయనం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ విభాగధిపతి ప్రొఫెసర్ వాగ్మారే మాయాదేవి చేతుల మీదుగా పట్టా అందుకున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయనను గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

శాస్త్రీయ విద్యావిధానం అందించాలి

నిర్మల్‌చైన్‌గేట్: దేశంలోని విద్యార్థులకు శాస్త్రీయ విద్యావిధానం అందించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్ అన్నారు. సంస్థాగత విద్యార్థి ఉద్యమ స్థాపన దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. రజనీకాంత్ మాట్లాడుతూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ 1936లో ఏర్పాటు చేశారని.. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్య విద్యార్థుల స్వరాలను విన్పించేందుకు ఇది వేదికగా ఉద్భవించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదాన, ముస్తఫా, శ్రీకాంత్, రాజు, కార్తీక్, రాకేశ్, రామ్ పాల్గొన్నారు.

సంఘాలు ఏర్పాటు చేయాలి

దస్తురాబాద్: సంఘాల్లో లేనివారితోపాటు కిశోర బాలికలు, వృద్ధులతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని డీపీఎం విజయలక్ష్మి.. గ్రామైక్య సంఘాల సభ్యులకు సూచించారు. సంఘాల ఏర్పాటుపై మంగళవారం దస్తురాబాద్ రైతువేదికలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో దివ్యదర్శిని మండల సమాఖ్య సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెర్ప్ అధికారులు సుదర్శన్, దేవేందర్, ఏపీఎం రమేశ్, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ఏఐఎస్ఎఫ్

నిర్మల్‌చైన్‌గేట్: విద్యారంగ సమస్యలపై పోరాడి విద్యార్థులకు అండగా ఏఐఎస్ఎఫ్(అఖిల భారత విద్యార్థి సమాఖ్య) ఉంటుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైలాశ్ అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ ఆవిర్భావ వేడుకలను జిల్లాకేంద్రంలోని ఇంద్రానగర్‌లో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా నాయకులు శ్వేత హాజరై అరుణ పతాకం ఆవిష్కరించారు. అనంతరం కైలాశ్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బెనారస్ యూనివర్సిటీలో పురుడు పోసుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్, ఉపాధ్యక్షుడు అష్ లాం, జిల్లా సహాయ కార్యదర్శి యాసర్, జిల్లా కోశాధికారి సంపత్, నాయకులు శ్రీకర్, నందకిశోర్, మనోజ్‌కుమార్, నరేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

భైంసాటౌన్: పట్టణంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో పలు మండలాల్లో బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఆదిత్య ఓ ప్రకటనలో తెలిపారు. భైంసా మండల పరిధిలోని ధననివాలా, ఆర్టీఏ సబ్‌స్టేషన్ల పరిధిలోని నిర్మల్ రోడ్, ఓవైసీనగర్, రాజీవ్‌నగర్, మోమినామ్ గల్లి, ఏక్‌మినార్ ఏరియా, మదీనా, భట్టిగల్లి, పురాణబజార్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. కుభీర్, తానూర్ ఫీడర్ల పరిధి గ్రామాల్లో, దేగాం ఫీడర్ పరిధిలోని దేగాం, ఇలేగాం, కుంసర, వాలేగాం, కామోల్ గ్రామాలకు, కల్లూర్ ఫీడర్ పరిధిలోని ఎగ్గాం, వానల్‌పాడ్, కోతుల్‌గాం, సుంక్లి, వాటోలి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అధ్వానంగా బండ్లబాటలు

- మోకాలిలోతు వరకు దిగబడుతున్న రోడ్లు
- గ్రామాల్లో పంటల వద్దకు వెళ్లేందుకు రైతుల పాట్లు
- పట్టించుకోని అధికారులు



ముధోల్ బస్టాండ్ సమీపంలోని రోడ్డుపై చేరిన నీరు

ముధోల్: మండలంలోని పలు గ్రామాల్లో పంటపొలాలు, చేన్ల వద్దకు వెళ్లే మట్టిరోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలు ఏర్పడి బురదమయంగా మారి మోకాలు లోతు వరకు దిగబడుతోంది. దీంతో ఎడ్లబండ్లపై, నడిచి వెళ్లేందుకు రైతులు, వ్యవసాయ పనులకు వచ్చే కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఏటా వర్షాకాలంలో చిన్నపాటి వర్షాలకే బురద ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. ఎరువులు, క్రిమిసంహారక మందులు, ట్రాక్టర్లను చేన్ల వద్దకు తీసుకెళ్లేందుకు కష్టాలు పడుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. తమ పంట చేన్లకు వెళ్లే మార్గాల్లో మట్టిరోడ్లు నిర్మించాలని కోరినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



గుంతలమయంగా రాంటెక్ వెళ్లే రోడ్డు



రువ్వి రైతులు వెళ్లే రోడ్డు దుస్థితి

ప్రధాన సమస్యలివీ..

- మండలకేంద్రమైన ముధోల్‌లో హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి మహాత్మా జ్యోతి బాపూలే చౌరస్తా వరకు బైపాస్ రోడ్డు అర కిలోమీటర్ మేర గుంతలమయంగా మారింది. ఏటా వర్షాకాలంలో గుంతలు నిండి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. దీంతో పలువురు ద్విచక్ర వాహనదారులు కింద పడి ఆసుపత్రి పాలవుతున్నారు.
- మండలంలోరి రువ్వి గ్రామానికి వెళ్లే మొరం రోడ్డు అస్తవ్యస్తంగా మారింది.
- ముధోల్ నుంచి విఠోలి వరకు వెళ్లే మార్గంలో అంతర్గత రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో రాత్రి రైతులకు పంట పొలాల్లోకి వెళ్లే రైతులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మండలంలోని రాంటెక్ గ్రామంలోని రామ్‌మందిరం వెనకాల నుంచి పంటలకు వెళ్లే రోడ్డుపై పశువులు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది.
- చించాల నుండి పిప్రి గ్రామం వరకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది.
- కారేగాం ఎక్స్‌రోడ్డు నుండి గన్నోరాకు వెళ్లే మార్గంలో రెండు కిలోమీటర్ల రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి.

మరమ్మతులు చేపట్టాలి..

సంబంధిత అధికారులు స్పందించి మట్టిరోడ్లకు తాత్కాలికంగా మరమ్మత్తులు చేపట్టడంతోపాటు అవసరమైన చోట ఉపాధిహామీ పథకం కింద కొత్త రోడ్లను నిర్మించాలని ప్రయాణికులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేసుకొని పంట పొలాలకు వెళ్లే రోడ్లను నిర్మించాలని కోరుతున్నారు.

గోస పడుతున్నాం..



పంట పొలాలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారడంతో పశువులు, మేకలు, గొర్రెలు ఆ రోడ్డుపై మోకాళ్ల లోతు వరకు దిగబడుతున్నాయి. ఏటా వర్షాకాలంలో ఎరువులు తీసుకెళ్లేందుకు గోస పడుతున్నాం. అధికారులు రోడ్డు వేయించాలి. – గణేశ్, ముధోల్

మొరం వేయించాలి



అధికారులు ఉపాధిహామీ పథకం కింద అంతర్గత రోడ్ల సమస్య పరిష్కరించాలి. దీంతో అన్ని గ్రామాల్లో రైతులకు, పశువులకు మేలు జరుగుతుంది. తాత్కాలికంగా మొరం పోయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి. – గంగాధర్, విఠోలి

రోడ్లు నిర్మిస్తున్నాం..

ఉపాధిహామీ పథకం కింద గతేడాది మండలంలోని 8 గ్రామాల్లో పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్లు నిర్మించాం. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. పలు గ్రామాల్లో పంట పొలాలకు వెళ్లే రోడ్ల దుస్థితి గురించి ఉన్నతాధికారులకు నివేదించి వ్యవసాయదారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం. – శిరీష, ఏపీఎం

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

లోకేశ్వరం: స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఉల్లాస్'కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. మంగళవారం లోకేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని వీవోఏలు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉల్లాస్ కార్యక్రమంపై ఒకరోజు శిక్షణనిచ్చారు. ఎంఈవో చంద్రకాంత్, మాస్టర్ ట్రెయినీలు మురళీధర్, చిన్నయ్య ఉన్నారు.

లక్ష్మణచాంద: ఉల్లాస్ కార్యక్రమంపై మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో అశోక్‌వర్మ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, వీవోఏలు పాల్గొనగా రిసోర్స్ పర్సన్లు శంకర్, గంగాధర్ ఉల్లాస్‌పై అవగాహన కల్పించారు.

కుంటాల: కుంటాల పాఠశాలలో మండలంలోని వీవోఏలు, ఉపాధ్యాయులతో ఉల్లాస్ కార్యక్రమంపై ఎంఈవో ముత్యం సమీక్ష నిర్వహించారు.



భైంసారూరల్ : హాజరైన టీచర్లు, వీవోఏలు

ఆర్పీలు నవీన్, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

భైంసారూరల్: భైంసాలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ నుంచి ఒక ఉపాధ్యాయుడు, ఒక వీఏవోను గుర్తించి శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్లు ఎల్లన్న, గోపాల్, మాధవి, ఉపాధ్యాయులు, వీవోఏలు ఉన్నారు.

మామడ: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉల్లాస్‌పై ఉపాధ్యాయులు, సెర్ప్ వీఓఏలకు శిక్షణనిచ్చారు. వలంటీర్లు వంద రోజుల్లో నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఎంఈవో వెంకటరమణారెడ్డి, ఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

- అభయ్ హిందూ సేన వ్యవస్థాపకుడు రాధామనోహర్ దాస్



మాట్లాడుతున్న రాధా మోహన్‌దాస్ స్వామీజీ

నిర్మల్ టౌన్: హైందవ ధర్మ పరిరక్షణ కోసం ప్రతీ హిందువు కృషి చేయాలని అభయ్ హిందూ సేన వ్యవస్థాపకుడు రాధామనోహర్ దాస్ అన్నారు. నిర్మల్ రథాల గుడి ప్రాంగణంలోని వేణుగోపాల స్వామి ఆలయం పక్కన హాల్‌లో కృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం ప్రవచనాలు బోధించారు. ముందుగా గోపాలస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు రాంమందిర్ వద్ద మహిళలు మంగళ హారతులు, కోలాటాలతో స్వాగతం పలికి ఆలయానికి తీసుకొచ్చారు. శ్రీకృష్ణ భగవాన్ జన్మ ప్రాముఖ్యత భక్తులకు తెలియజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, కౌన్సిల్ సభ్యులు గీతామూర్తి, అంజుకుమార్‌రెడ్డి, రాంనాథ్, అయ్యన్నగారి భూమయ్య, మంగ, భక్తులు పాల్గొన్నారు. అంగారక సంకటహర చవితి పురస్కరించుకుని ఆలయంలో కొలువుదీరిన అన్నపూర్ణ సాహిత కాశీ విశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం, సహస్ర మోదక గణపతి హోమం, సహస్ర దుర్వా(వెయ్యి గరకల)తో విశిష్ఠ అర్చన జరిపించారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ తీశారు. ప్రజల్లో జాతీయ భావనలు, స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునేందుకు ర్యాలీ నిర్వహించామని ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఆవిష్కరించాలని కోరారు. అధ్యాపకులు గంగాధర్, ఉమేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

కడెం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు కడెం వీధుల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి వినోద్‌కుమార్, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, పీడీ వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మహిళా సంఘాల్లో చేరాలి

భైంసాటౌన్/కుభీర్: కుభీర్ మండల కేంద్రానికి చెందిన బొడ్డు యశోద ఇటీవల పాముకాటుతో మృతి చెందింది. స్వయం సహాయక సంఘంలో సభ్యురాలైన ఈమె పేరిట రూ.10లక్షల ప్రమాద బీమా మంజూరైంది. మంగళవారం పట్టణంలో ఎమ్మెల్యే రామారావు పటేల్.. నామినీ అయిన ఆమె భర్త బొడ్డు పోతన్నకు చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరాలని సూచించారు. ఐకేపీ ఏపీఎం రాథోడ్ ఉత్తమ్, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ స్వాతి, ఐకేపీ సీసీ సరస్వతి, బీజేపీ నాయకులు సత్యనారాయణ్, దత్తాత్రి, రమేశ్ తదితరులు ఉన్నారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ఈజీఎస్ కింద తానూరు మండలంలోని భోసి బీసీ హాస్టల్‌కు రూ.27 లక్షలు, భైంసా మండలంలోని వానల్‌పాడ్, మాటేగాం, తానూర్ మండలంలోని బోంద్రట్ ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ నిర్మాణాలకు రూ.12 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మత్తుకు దూరం ఉండాలి

భైంసాటౌన్: యువత మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మత్తు పదార్థాలు శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. అంతకుముందు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నోమన్, సీఐ గోపీనాథ్, ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, సైకాలజిస్ట్ సురేశ్, కళాశాల ప్రిన్సిపాల్ శివరంజనిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ ఉన్నత పాఠశాలలో బాలశక్తి ఏర్పాటు చేశారు. వైద్యురాలు ఫర్జానా బేగం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఆరోగ్యం, ఆర్థిక అక్షరాస్యత, క్షేత్ర పర్యటన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం నగేశ్, ఫార్మసిస్ట్ ప్రశాంతి, సీఆర్పీ సుధాకర్ తదితరులున్నారు.

ఆయిల్‌పాం ఫ్యాక్టరీ సందర్శన

లక్ష్మణచాంద: మండలంలోని లక్ష్మణచాంద, చామన్‌పెల్లి గ్రామాల రైతులు ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట ఆయిల్‌పాం పంటలు, ఫ్యాక్టరీని మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా అక్కడి రైతులతో ఆయిల్‌పాం సాగు, కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతులు రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గంగారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంచడమే లక్ష్యం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 'అటల్ ఆలోచనాత్మక మెగా దినోత్సవం'నిర్వహించారు. పాఠశాలకు చెందిన ఐదు బ్యాచ్‌లలోని 30 మంది పదో తరగతి విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా సృజనాత్మకత పరికరం తయారు చేశారని వివరించారు. కేంద్రప్రభుత్వం విద్యావిభాగం ఆధీనంలో ఇప్పటికే నమోదు చేసుకున్న విద్యార్థులు మంగళవారం ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా ఆన్‌లైన్‌లో పాల్గొని ప్రాజెక్ట్‌ను తయారు చేశారన్నారు. హెచ్‌ఎం నరేందర్‌రావు, గైడ్ టీచర్లు శంకర్, రవికుమార్, ఫరాజ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం టై బెల్టులను అందజేశారు. అదే పాఠశాలలో పని చేసే హెచ్‌ఎం అశోక్‌కుమార్, ఉపాధ్యాయుడు వేణుగోపాల్ కలసి రూ.15వేలతో 60 మంది విద్యార్థులకు టై, బెల్టులను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

'ఎంపీల అరెస్ట్ అప్రజాస్వామికం'

ఖానాపూర్: ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల నిర్వహణలో లోపాలపై ప్రశ్నించిన ఇండియా కూటమి ఎంపీల అరెస్ట్ అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఎంపీల పట్ల ఎన్డీఏ సర్కార్ వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- రంగపేట్‌లో పాఠశాల ప్రారంభం
- సత్తన్‌పల్లిలో దివ్యాంగులకు ఉపకరణాలు అందజేత



సత్తన్‌పల్లిలో ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

ఖానాపూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని రంగపేట్ గ్రామంలో నూతనంగా మంజూరైన ప్రాథమిక పాఠశాల(ఇంగ్లిష్ మీడియం)ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంగపేట గ్రామాన్ని ఇటీవల ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశామని.. నూతన పాఠశాలకు సొంతం భవనం నిర్మించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకముందు బీర్నంది జెడ్పీహెచ్‌ఎస్‌లో బాలశక్తి కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. శారీరక ఎదుగుదల ఉంటేనే విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు, కరాటే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం సత్తన్‌పల్లి రైతువేదికలో అలీంకో కంపెనీతోపాటు స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లోని 240 మందికి రూ.27 లక్షల విలువైన 405 ఉపకరణాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా 40 మంది లబ్ధిదారులకు వీల్‌చైర్లు, తదితర ఉపకరణాలను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, నాయకులు పడిగెల భూషణ్, తోట సత్యం, ఇప్ప సత్యనారాయణరెడ్డి, చిన్నం సత్యం, బానావత్ రాంచందర్, కట్కం శ్రీనివాస్, కోవ సుంగు, పెట్టం సత్తన్న, మణిచరణ్, బలరాం, అక్కల శంకర్, అధికారులు, తదితరులున్నారు.

సమష్టి సహకారం అందించాలి

ఖానాపూర్: పట్టణంలో నిలిచిన రోడ్డు వైడింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రజలు సమష్టి సహకారం అందించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. మంగళవారం పట్టణంలోని రోడ్డు వైడింగ్ పనులను మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా రోడ్డు పక్కన నివాసాలున్న యజమానులు రోడ్డు మధ్య నుంచి 40 ఫీట్ల మేర స్థలం స్వచ్ఛందంగా ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ విషయాన్ని అధికారులతో చర్చించి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం అనారోగ్యంతో ఇంటి వద్ద చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, ఆత్మ చైర్మన్ తోట సత్యం, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఎంఏ మాజిద్, చిన్నం సత్యం, కావలి సంతోష్, ఖానాపూర్ కోర్టు ఏజీపీ ఆసిఫ్ అలీ, రాజేందర్, లక్ష్మీపతిగౌడ్, మీర్జాబేగ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే అనుమతులు

కడెం: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కృషితోనే కవ్వాల్ టైగర్ జోన్ గుండా భారీ వాహనాల రాకపోకలకు అనుమతులు వచ్చాయని.. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్ అన్నారు. మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్ ఆధ్వర్యంలో మంగళవారం కడెంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద సీఎం, ఇన్‌చార్జి మంత్రి కృష్ణారావు, అటవీశాఖ మంత్రి సురేఖ, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇందులో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, యూత్ కార్యదర్శి గోపాల్, ఆత్మ కమిటీ డైరెక్టర్ బాలాజీ, నాయకులు బబ్లూ, ప్రతాప్, మల్లయ్య, కృష్ణ, లచ్చన్న, గంగన్న రాజు, నవీన్ తదితరులున్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సోమవారం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్–13 ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నిర్మల్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు రాథోడ్ వైష్ణవి, షేక్ గులాం అర్షన్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గౌతమ్ విద్యాసంస్థల సీఈవో భరత్‌కుమార్ విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ రమేశ్ మంగళవారం విద్యార్థులను సత్కరించారు.



నిర్మల్‌లో విద్యార్థులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

యోగా పోటీల్లో తానూరు విద్యార్థి ప్రతిభ

తానూరు: తెలంగాణ యోగాసన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భైంసాలోని గౌతమి హై స్కూల్‌లో ఈనెల 4న నిర్వహించిన 6వ జిల్లా స్థాయి పోటీల్లో తానూరు వివేకానంద పాఠశాల విద్యార్థి టి.పార్థు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విశాంత్ తెలిపారు. వచ్చే నెలలో నిర్మల్‌లో మూడు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పార్థు పాల్గొంటారని వెల్లడించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పార్థును అభినందించారు.

సంక్షిప్త వార్తలు

ఏవో పోస్టు పునరుద్ధరించాలి

భైంసాటౌన్: పట్టణంలో వ్యవసాయాధికారి పోస్టును పునరుద్ధరించి విత్తన, పురుగుమందు విక్రయాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం భైంసా ఏడీఏ కార్యాలయంలో ఏడీఏ వీణకు వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ భైంసా అర్బన్ ఏవో పోస్టును నిర్మల్‌కు బదిలీ చేయడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు దేవ్‌రావు, సంపత్‌రావు, తానాజీ పటేల్ తదితరులున్నారు.

దివ్యాంగులకు చేయూత

ముధోల్: మండలకేంద్రంలోని పలువురు దివ్యాంగులకు మంగళవారం ముధోల్‌కే చెందిన సుభాష్ వాకర్లు, హ్యాండ్ స్టిక్‌లను అందించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు నారాయణ, గ్రామపెద్దలు లక్ష్మన్న, సంజుపటేల్, తన్వీర్, పోశెట్టి, అశోక్, గంగాధర్, ప్రసాద్, ప్రవీణ్, నవీన్ పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన

దస్తురాబాద్: మండలంలోని పేర్కపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆధార్ క్యాంపు

ముధోల్: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం, గురువారం ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అందరూ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు.

వనమహోత్సవం

నిర్మల్‌టౌన్: పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయ ప్రాంగణంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి సొంత ఖర్చులతో రాగి, మర్రి, జువ్వి మొక్కలు తెప్పించారు. వేద పండితులు గురుమంచి చంద్రశేఖర్‌శర్మ ప్రత్యేక పూజలనంతరం ఆలయ ఆవరణలో నాటించారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సాయి దీక్ష సేవాసమితి సభ్యులు జైపాల్‌రెడ్డి, నందు పాల్గొన్నారు.

ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన

తానూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ముంపు గ్రామమైన ఝరి(బి)లో మంగళవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల సభ్యులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అధికారి వినీత్‌కుమార్ మాట్లాడుతూ ఫస్ట్ ఎయిడ్, వరద, భూకంపం, ఉరుముల నుంచి మనల్ని మనం కాపాడుకునే విధానం ప్రజలకు వివరించారు. వరదల సమయంలో నడుముకు ప్లాస్టిక్ బాటిళ్లు కట్టుకోవాలని.. ఉరుముల వేళ చెట్ల కింద ఉండవద్దని సూచించారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, ఏపీఓ శివలింగం, ఆర్ఐ నరేశ్, గ్రామ కార్యదర్శి జాదవ్ విక్రమ్, టెక్నికల్ అసిస్టెంట్ రమణగౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

నిర్మాణం నిలిపేయాలని నిరసన

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో అంబేద్కర భవన నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరుతూ మంగళవారం బస్టాండ్ ప్రాంతంలో మాదిగ సామాజిక వర్గం సంఘం సభ్యులు నిరసన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాస్ అక్కడకు వెళ్లి వారికి నచ్చజెప్పారు. చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని సూచించడంతో వారు నిరసన విరమించారు. ఇందులో మాదిగ సంఘం సభ్యులు పాల్గొన్నారు.